# సృష్టి 7 రోజులు - దేవుని 7 పండుగలు - యషువా మెస్సీయ్యలో వాటి నెరవేర్పులు

| రోజు | సృష్టి | పండుగ | క్రీస్తులో నెరవేర్పు |
|---|---|---|---|
| 1వ | వెలుగు | పస్కా | సిలువలో బలి |
| 2వ | ఆకాశము, భూమి | పులియని రొట్టెల | క్రీస్తు - పునరుత్థానము, రొట్టె, ద్రాక్షారసము |
| 3వ | పచ్చని చెట్లు | ప్రధమ ఫలాల | క్రీస్తు - ప్రధమ ఫలము |
| 4వ | జ్యోతులు | పెంతెకొస్తు | పరిశుద్ధాత్మ |
| 5వ | జలచరములు, పక్షులు | బూరల | శృంగధ్వని |
| 6వ | మానవులు | పాప ప్రాయశ్చిత్తార్ధ | యేసు రక్తంలో కడుగబడుట |
| 7వ | విశ్రాంతి | పర్ణశాలల | రెండవ రాకడ, మధ్యాకాశం |

దేవుడు 6 రోజులలో ఈ భూమిమీద మరల పునః సృష్టి చేసాడు. ఇదివరలో చెప్పినట్లుగా దేవుడు మొట్టమొదట ఈ భూమిని చేసినప్పుడు దానిని నిరాకారము గాను, శూన్యముగాను ఉండేలా చేయలేదు. అయితే సాతాను దానిని నిరాకారముగాను, శూన్యముగాను తయారు చేసాడు. అలా నిరాకారముగా చీకటి అలుముకొని ప్రాణి అనేది ఏదీ ఈ భూమిమీద లేని పరిస్థితులలో దేవుడు మరలా పూనుకొని భూమిమీద ఉన్న ఈ గాడాంధకారాన్ని పారద్రోలి వెలుగు కలుగజేసి పచ్చని చెట్లు, ఆకాశ పక్షులు, జలచరాలు, నేలమీద తిరుగు ప్రతి ప్రాణిని చేసి ఆఖరికి దేవుని పోలికతో మానవుని సృష్టించి 7వ రోజున విశ్రాంతి తీసుకున్నాడు. దేవుని ఆ 7 రోజుల పని అంతా కూడా ఈ భూమిమీద ఆయా కాలాలలో జరుగబోయే ముఖ్య విషయాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇది దేవుని యొక్క 7వేల సం॥ల ప్రణాళికా కాలంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క మైలు రాయి. ఈ 7రోజుల సృష్టికి యెహోవా దేవుని 7 పండుగలకు (నియామక దినములు) అవినాభావ సంబంధమున్నది.

**To renew your love for God, revew gods love for you.**

అలాగే ఈ 7 పండుగలకు యషువా మెస్సీయ యొక్క జీవిత చరిత్రకు అవినాభావ సంబంధమున్నది. ఈ 7 పండుగలు యషువా మెస్సీయలో నెరవేర వలసి ఉన్నది. దేవుని 7వేల సంవత్సరముల ప్రణాళికనంతా ఈ 7 పండుగలలో దేవుడు మనకు ముందుగానే తెలియచెప్పాడు. వాటిలో 6 పండుగలు యషువా మెస్సీయలో నెరవేరినవి. ఇక చివరి పండుగయైన పర్ణశాలల పండుగ నెరవేరవలసి ఉన్నది. దానిలో మొదటి రోజున ఆయన వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగింది. అది బాగుందని దేవుడు అనుకొన్నాడు. ఇక్కడ కలిగిన వెలుగు శాశ్వతమైనది కాదు. అల్లకల్లోలంగా, అంధకార మయంగా నిర్జీవంగా ఉన్న భూమిని బాగుచేసే ఉద్దేశ్యంతో తాత్కాలికంగా కలుగజేసిన వెలుగు మాత్రమే. ఎందుకంటే భూమికి వెలుగిచ్చేది, శక్తినిచ్చేది నూటికి నూరుపాళ్ళు సూర్యుడే. చంద్రుడు, నక్షత్రాలనుండి వచ్చే వెలుగు, శక్తి అతి స్వల్పం మాత్రమే. ఆ సూర్యుడు నాల్గవ రోజున చేయబడ్డాడు. అంటే మొదటి రోజున సూర్యకాంతి లేదు. కాని దేవుడు వెలుగును రప్పించాడు. అసలు వెలుగునిచ్చేది తరువాత వస్తుంది. ఇప్పటి వెలుగు దానికి నాంది మాత్రమే.

అలాగే యెహోవా నియామక పండుగలలో మొదటిది పస్కా పండుగ. (లేవీ. 23:5) ఇశ్రాయేలీయులు ఐగుప్తులో యోసేపు రాజుగా ఉన్నప్పుడు వారెంతో ఘనంగా బ్రతికారు. ఒక ఇశ్రాయేలీయుడు (యోసేపు) ఆ దేశానికి రాజు తర్వాత రాజుగా ఉన్నాడు. కాని ఆ తర్వాత యోసేపును ఎరుగని క్రొత్త రాజు వచ్చాడు. దాంతో ఇశ్రాయేలీయులకు కష్టాలు మొదలయ్యాయి. రాజు తర్వాత రాజు మారేటప్పటికి వారి కష్టాలు మరింత ఎక్కువయ్యేవి. వారి జీవితం అంధకారమయమైంది. వారి బ్రతుకంతా చీకటే. భూమి నిరాకారము గాను, శూన్యముగాను ఎలా ఉండేదో వారి బ్రతుకు కూడా అలాగే వుండేది. అలా 400 సం॥పైన చీకటి బ్రతుకులలో ఉన్నారు. అప్పుడు యెహోవా దేవుడు వారిని ఆ చీకటి బ్రతుకు నుండి విడిపించడానికి దిగి వచ్చాడు. వారు విడిపించబడాలంటే వారి బ్రతుకులలో చీకటి పోయి వెలుగు రావాలంటే వారు పస్కా పశువును వధించాలి. దేవుడు వెలుగు కమ్మని పలికాడు. వెలుగు కలిగెను. అంటే పస్కా పశువును వధించండి అని చెప్పాడు. వారు వధించారు. ఆ రక్తాన్ని ద్వార బంధాలకు పూసారు. అంతే వారి బ్రతుకులలో వెలుగు వచ్చేసింది. చీకటి బ్రతుకులనుండి విడిపించబడ్డారు. దుఃఖంపోయి ఆనందం వచ్చింది. (కీర్తనలు 118:27.) ఈ పస్కా పండుగ యషువా మెస్సీయ

**Failure is never final, if you begin again with God.**

అను మన పస్కా పశువు శిలువలో బలి అవటంతో ఈ పండుగ క్రొత్త నిబంధనలో నెరవేరింది. పస్కా పశువు యొక్క బలి, యషువా మెస్సీయ సిలువలో బలి ఈ రెండూ అతి ఖచ్చితంగా ఒకేలా జరిగాయి. (తేదీ, వారం, గంటలతో సహా) అది ఎలాగో దేవుని చిత్తమైతే వచ్చే సంచికలలో చూద్దాం.

**కాబట్టి సృష్టి మొదటి రోజు – వెలుగు కలుగజేసెను – మొదటి పండుగ పస్కా – అది యెషువా మెస్సీయలో సిలువ మరణం ద్వారా నెరవేరింది.**

సృష్టి 7 రోజులలో 2వ రోజున దేవుడు ఆకాశమును, భూమిని వేరు పరచాడు. పై జలాలను, క్రింది జలాలను వేరుపరచాడు. మధ్యలో పెద్ద విశాలమును కలుగజేసాడు. ఆ విశాలమునకు ఆకాశము అని పేరు పెట్టాడు. ఆకాశము క్రిందనున్న జలాలన్నింటినీ ఒకేచోట ఉండమన్నాడు – అది సముద్రం. ఆరిన నేల భూమి.

ఇక్కడ దేవుడు కలుగజేసిన ఆకాశము, భూమి, సముద్రములు ఇవన్నీ కూడా తాత్కాలికమైనవే. ఎందుకంటే ఈ భూమి, ఆకాశము గతిస్తాయి. సముద్రము ఇక ఉండదు. మనకు త్వరలో క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి కలుగబోతున్నాయి. రెండవరోజున పై జలాలు, క్రింది జలాలు వేరుపరచ బడ్డాయి. ఆకాశము, భూమి వేరు పరచబడ్డాయి. భూమి, సముద్రము వేరు పరచబడ్డాయి. అలాగే రెండవ పండుగ అయిన పులియని రొట్టెల పండుగ పస్కా పండుగ వెంబడే వస్తుంది. (లేవీ. 23 :6–8) పస్కాను పశువును వధించిన రాత్రే పులియని రొట్టెలతో ఆ పస్కా పశువు మాంసమును భుజించాలి. ఈ పండుగను 7 రోజులు చేయాలి. ఇక్కడ ఈ పండుగలో పులిసినది ఏ మాత్రము కనపడకూడదు. పులియని పిండితో పులిసిన పిండి కొంచెం కలిసినా గాని మొత్తం పులియని ముద్దంతా పులిసిపోతుంది. ఇక్కడ వేరవ్వాలి. పులిసిన దానితో పులియనిది వేరు కావాలి. ఈ పులియని రొట్టెల పండుగ 7 రోజుల లోపునే యషువా మెస్సీయా (యేసు క్రీస్తు) భూగర్భంలో ఉన్నాడు. మూడు రాత్రింబవళ్ళు భూ గర్భంలో ఉన్న తరువాత మరలా తిరిగి లేపబడ్డాడు. దేవుడు ఆయనను మృతులలోనుండి లేపాడు. (అపో.కార్య 10:41, రోమా 10:9, 1 కొరింథీ 17:12, హెబ్రీ 11:19, 13:20) అంటే పులియని రొట్టెల కాలంలో యషువా మెస్సీయ యొక్క సమాధి, పునరుత్థానము జరిగినవి. ఈ పులియని రొట్టెల కాలంలో ఇశ్రాయేలీయులు కనాను దేశమునకు ప్రయాణం కట్టారు. పులియని రొట్టెలు తిన్నారు. అదే రీతిలో యషువా మెస్సీయ సిలువలో

బలై, పాతిపెట్టబడి మరలా తిరిగి లేచిన దగ్గరనుండి మన క్రైస్తవ పరమ కనాను యాత్ర మొదలయింది. ఈ యాత్రలో పులిసినదేదీ లేకుండా కేవలం పులియని వాటితో మాత్రమే అంటే "పాతదైన పులిపిండితోనైనను, దుర్మార్గతయు, దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండా నిష్కాపట్యమును, సత్యమునను పులియని రొట్టెతో" పండుగ ఆచరింతము. (1కొరింథీ 5:8)

"ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతా స్తుతులు చెల్లించి దానిని విరిచి ఇది మీ కొరకైన నా శరీరము నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను". (1 కొరింథీ 11:23-24)

కాబట్టి యషువా మెస్సీయలో ఈ పండుగ నెరవేర్పును చూస్తున్నాము. ఆయన వచ్చు పర్యంతము ఆయనను జ్ఞాపకము చేసికొనుటకు రొట్టెను తిని, ద్రాక్షారసమును మనము త్రాగుచున్నాము. మన మనసులలో పులియనివి అంటే నిష్కాపట్యము, సత్యము అనునవి ఉంచుకొని దీనిలో పాలుపొందాలి. అంతేకాకుండా ఆయనను జ్ఞాపకము చేసుకొంటూ మనం తినే ఆ రొట్టె ఏదైనా గాని పులిసిన పిండితో చేయకూడదు. అసలు పులిసిన దానితో చేయకూడదని ఆజ్ఞాపిస్తే ఆ ఏముందిలే ఆత్మీయంగా పులియకుండా ఉంటే సరిపోతుందిలే అని తప్పుదోవ పట్టిస్తారు. ఆయనను జ్ఞాపకము చేసికొంటూ తినే ఆ రొట్టెను చేస్తున్నప్పుడే పులిసినది లేకుండా చేయలేని నీవు ఇంక మనసులో పులిసిన దానిని ఎలా తీసివేస్తావు ? ఎందుకంటే చాలామంది దీనిని ఒక ఆచారంగా మాత్రమే కానిస్తున్నారు గాని, దాని విలువ, దాని ప్రత్యేకత, ప్రాముఖ్యత అసలు గుర్తెరగకుండా బజారులో అమ్మే బ్రెడ్‌ను తీసుకువచ్చి దానిని ముక్కలుగా కోసి అందరితో తినిపిస్తారు. వాళ్ళు కూడా తింటారు. ఆ బ్రెడ్ పూర్తిగా పులిసిన పిండితో తయారు చేయబడుతుంది. పిండిని పులియబెట్టటానికి దానిలో 'బేకర్స్ ఈస్ట్' అనే దానిని కలుపుతారు. బేకర్స్ ఈస్ట్‌లోని ఈస్ట్ కణాలు ఆ పిండినంతా పులియబెడతాయి. ఆ పులిసిన పిండితో బ్రెడ్ తయారుచేస్తారు. ఆ బ్రెడ్‌నే యషువా మెస్సీయను జ్ఞాపకము చేసుకుంటూ 1 కొరింథీ 5:7,8 కి వ్యతిరేకంగా ఈ పులియని రొట్టెల పండుగను ఆచరిస్తుంటారు. అలాంటివారు వారి చర్యలను ఎంతగా సమర్థించుకొన్నా గాని, వారు యషువా మెస్సీయా (యేసుక్రీస్తు) యొక్క శరీరమును గూర్చి అపరాధులు అవుతారు. వారికి ఇదంతా ఒక లాభకరమైన ఆచారమే గాని, నిబద్ధత లేదు. ఇప్పుడు బాగానే ఉంటుంది. అయితే ఇకమీదట తెలుస్తుంది.

---

**సండేస్కూల్‌కు ఉపయోగపడు ఫ్లానల్ క్లాత్ స్టోరీస్,**
**క్రాఫ్ట్ వర్క్ మొదలగు మెటీరియల్‌కై సంప్రదించండి.**

**కాబట్టి సృష్టి 2వ రోజు - పై జలములను, క్రింది జలములను వేరు చేసెను, ఆకాశమును, భూమిని వేరు చేసెను, భూమిని, సముద్రమును వేరు చేసెను - రెండవ పండుగ - పులియని రొట్టెల పండుగ - యషువా మెస్సీయా యొక్క శరీరమును, రక్తమును జ్ఞాపకము చేసికొనుచూ మనం ఆచరిస్తున్న రొట్టె, ద్రాక్షారసముతో నెరవేరుతుంది.**

సృష్టి 7 రోజులలో 3వ రోజున దేవుడు, గడ్డిని, విత్తనములిచ్చు చెట్లను, ఫలవృక్షములను చేసెను.

రకరకాల విత్తనాలిచ్చే చెట్లు, మొక్కలు, రకరకాల ఫలాలనిచ్చే వృక్షాలు 3వ రోజున సృష్టించబడ్డాయి. అప్పటికింకా సూర్యుడు లేడు. సూర్యుడు 4వ రోజున కలుగచేయబడినది. యెహోవా పండుగలలో 3వ పండుగ ప్రథమ ఫలాల పండుగ. (లేవీ. 23:9-14) ఈ ప్రథమ ఫలాల పండుగ రోజున వారి పొలములో కోతకు సిద్ధముగా ఉన్న పంటలో ఒక పన కోసి యాజకుని యొద్దకు తీసుకుని వచ్చి అక్కడ యాజకుడు చేయవలసిన కార్యక్రమమంతా చేయాలి. అంటే మిగిలిన పంట మొత్తం కోతకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులలో ఆ మొత్తం పంట కోయబడుతుంది. దానికి ముందుగా ఈ పనను దేవుని వద్దకు తీసుకొని రావటం జరిగినది అనే అర్థం వచ్చేటట్లుగా యాజకుడు ఆ పనను యెహోవా సన్నిధిని అల్లాడిస్తాడు.

ఈ పండుగ యషువా మెస్సీయ యొక్క పునరుత్థానము వలన ఆయన మృతులలోనుండి లేచినవారిలో ఆది సంభూతుడుగా ఉండి ప్రథమ ఫలముగా ఆయన పునరుత్థానుడైనాడు, ఆ తరువాత ఆయన వారమైన మనము కూడా ఆయన వచ్చేసరికి జీవించి ఉంటే మహిమ శరీరము పొంది ఎత్తబడతాము, ఒకవేళ చనిపోయి ఉంటే పునరుత్థానులమౌతాము అని తెలియచేస్తుంది. కాబట్టి ఈ పండుగ కూడా యషువా మెస్సీయలో నెరవేరింది.

**కాబట్టి సృష్టిలో 3వరోజు - పచ్చని చెట్లు, మొక్కలు - 3వ పండుగ - ప్రథమ ఫలాల పండుగ - యషువా మెస్సీయ పునరుత్థానులలో ప్రథమ ఫలము - పండుగ నెరవేర్పు - ఆ తరువాత మనం కూడా ఎత్తబడుట, లేదా పునరుత్థానులమగుట.**

సృష్టి 7 రోజులలో 4వ రోజున దేవుడు సూర్యుని, చంద్రుని, నక్షత్రాలను చేసెను.

నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు అన్నీ ఒకేరోజు ఏర్పడినవి కాదు. కాంతి ఒక సెకనుకు 3 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అంత వేగంతో ప్రయాణించే కాంతి కొన్ని కొన్ని నక్షత్రాలనుండి బయలుదేరి ఇంతమటుకు మన భూమికి చేరనేలేదు. అంటే చాలా నక్షత్రాలు మనకు కొన్ని లక్షల, కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. ఒక్కొక్క నక్షత్రం వయసు ఒక్కొక్క రకంగా ఉంటుంది. వాటి వయసు కోట్ల సంవత్సరాలుగా ఉంటుంది. అవన్నీ ఇక్కడ చెప్పటం అప్రస్తుతమైనా గాని, చెప్పకపోతే బాగుండదనిపిస్తుంది. ఇంతకీ ఇక్కడ చెప్పొచ్చే విషయమేమిటంటే దేవుడు ఆదామును చేయడానికి 2 రోజుల

ముందు సూర్యుని చేయలేదు. అది కొన్ని కోట్ల సంవత్సరాల క్రితమే ఉంది. కాని దానినుండి వెలుగు భూమిపై పడకుండా సాతాను తన పద్ధతులలో ఆ కాంతిని అడ్డగించాడు. ఇప్పుడు సాతాను చెడగొట్టిన వాటినన్నిం టినీ దేవుడు మరలా సరిచేస్తున్నాడు. మరలా సూర్యకాంతి భూమిమీద పడేలా చేస్తున్నాడు. ఈ వెలుగు భూమిమీద ఉన్న సకల ప్రాణులకు శక్తినిచ్చేది. అంటే శక్తి వనరులు మరలా పనిచేసేలా చేస్తున్నాడు. ఈ సూర్యుని శక్తిచేతనే ఆ ముందురోజు చేసిన మొక్కలు బ్రతుకుతాయి. ఆ మొక్కలుంటేనే 5వ రోజు చేయబడే జంతువులు బ్రతుకుతాయి. అయినాగాని ఈ శక్తి వనరు అయిన సూర్యుడు తాత్కాలికమే. యషువా మెస్సీయ తిరిగి వచ్చిన తరువాత, వెయ్యేండ్ల పాలన అయిన తరువాత ఈ సూర్యుడు ఇంకనూ కాంతినీయడు. ఆ తరువాత మనం పరలోకం చేరితే అక్కడ అసలు సూర్యుడే ఉండదు. అసలు సూర్యుడి అవసరమే ఉండదు.

4వ రోజున దేవుడు శక్తి వనరు అయిన సూర్యుని చేసాడు. అలాగే 4వ పండుగ అయిన పెంతెకొస్తు పండుగ (లేవీ. 23:15-21) ప్రథమ ఫలాల పండుగనాడు వారు తెచ్చిన అల్లాడించు పనను తెచ్చిన రోజునుండి 50 రోజులకు అంటే 3వ పండుగ నుండి 50వ రోజున పెంతెకోస్తు పండుగ జరుపుకోవాలి. పెంతెకోస్తు అంటే 50వ రోజు. యషువా మెస్సీయ శనివారం సాయంత్రం అంటే యూదుల పద్ధతి ప్రకారం ఆదివారం మొదలున పునరుత్థానుడైనాడు. ఆదివారం తెల్లవారుఝామున ఆయన తిరిగి లేచాడు అనేది ఒక గ్రుడ్డి నమ్మకం మరియు తప్పుడు అవగాహన మాత్రమే. 3వ పండుగ అయిన ప్రథమ ఫలాల పండుగ విశ్రాంతి దినము మరుసటి రోజున అంటే ఆదివారము మొదలవుతుంది. యషువా మెస్సీయా కూడా విశ్రాంతి దినము అయిపోయిన తరువాత ఆదివారం ప్రారంభమపుడు తిరిగి లేచాడు. ఆ రోజు నుండి 50వ రోజున అంటే పెంతెకోస్తు పండుగ దినమున అపొస్తలులు, మరికొంతమంది యషువా మెస్సీయను నమ్మినవారు ఇంచుమించు 125 మంది అందరూ ఒక చోట కూడియున్నారు. అప్పుడు అకస్మాత్తుగా పరిశుద్ధాత్మ అగ్ని జ్వాలవంటి నాలుకలు విభాగింప బడినట్లుగా వారిమీద వ్రాలింది. అప్పుడు వారందరూ పరిశుద్ధాత్మ నిండిన వారైరి. పరిశుద్ధాత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది వారు అన్య భాషలతో మాట్లాడసాగారు. (అపొ.కార్య 2:1-4)

పరిశుద్ధాత్మ మనకు శక్తినిస్తుంది. కాబట్టి పెంతెకోస్తు పండుగన పరిశుద్ధాత్మ దిగివచ్చుట వలన ఆ పండుగ కూడా యషువా మెస్సీయలో నెరవేరింది.

**కాబట్టి సృష్టి 4వ రోజు శక్తినిచ్చు జ్యోతుల సృష్టి - 4వ పండుగ - పెంతెకొస్తు పండుగ - యషువా మెస్సీయలో నెరవేర్పు - పెంతెకొస్తు పండుగనాడు శిష్యులపై పరిశుద్ధాత్మ శక్తి దిగి వచ్చుట**

(మిగతా తరువాయి సంచికలో)